గణపతి బప్పా మోరియా..


మార్కెట్‌లో గణపతి విగ్రహాలు

- చవితి సంబరాలకు సర్వం సిద్ధం
- వాడవాడలా ఘనంగా ఏర్పాట్లు
- నేడు ఒడ్డిమెట్టలో భారీ తిరునాళ్లు


గ్రామాల్లో చవితి సంబరాల కోసం ఏర్పాటు చేస్తున్న మండపాలు

నక్కపల్లి: గణపతి బప్పా మోరియా అంటూ వినాయక చవితి పండగను ఘనంగా జరుపుకొనేందుకు పల్లెలు ముస్తాబయ్యాయి. ప్రత్యేక మండపాల్లో గణనాథుడు బుధవారం కొలువుదీరనున్నాడు. తొమ్మిది రోజుల పాటు భక్తులతో పూజలు అందుకోనున్నాడు. నక్కపల్లి, దేవవరం, ఉద్దండపురం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు, ఉపమాక, వేంపాడు, కాగిత, నెల్లిపూడి, డీఎల్‌పురం, సిహెచ్‌ఎల్ పురం, జానకయ్యపేట, రమణయ్యపేట, గుల్లిపాడు, రేబాక, తదితర గ్రామాల్లో ఉన్న గణపతి ఆలయాల్లో విగ్రహాలకు రంగులు వేసి విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆటో స్టాండ్లు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన కమ్యూనిటీ భవనాల వద్ద కూడా మండపాలు ఏర్పాటు చేసి నవరాత్రులు చేస్తున్నారు. ఈ ఏడాది వినాయక చవితికి నాలుగు రోజుల ముందు నుంచే సముద్రంలో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు రోజుల్లో కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నవరాత్రులపై ప్రభావం పడే అవకాశం ఉంది. మంగళవారం కురిసిన వర్షం కారణంగా నీరు చేరడంతో బుధవారం చేసే గణపతి పూజకు ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో పూజా సామగ్రి కొనుగోలుకు భక్తులు చాలా ఇబ్బంది పడ్డారు. మార్కెట్లన్నీ చిత్తడిగా మారాయి. వర్షం ప్రభావం పూజా సామగ్రి విక్రయాలపై కూడా పడింది.


ఒడ్డిమెట్టలో చవితి పూజలకు సిద్ధమైన లక్ష్మీగణపతి

ఒడ్డిమెట్టలో భారీ ఏర్పాట్లు

గ్రామీణ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఒడ్డిమెట్ట గణపతి నవరాత్రులకు భారీ ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. బుధవారం ఇక్కడ తిరునాళ్లు జరగనున్నాయి. నక్కపల్లి, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, తుని, పాయకరావుపేట, అడ్డురోడ్డు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది స్వామివారి దర్శనం కోసం రానున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేకంగా బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి అష్టోత్తరంతో అభిషేకం తొలిపూజ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని అర్చకుడు గోపాల కృష్ణ తెలిపారు. నక్కపల్లి సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

గణేష్ మండపాలకు క్యూఆర్ కోడ్

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- సీఐ ఎస్ ధనుంజయరావు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: ఈ సారి వినాయక చవితి వేడుకలకు పోలీసు శాఖ షరతులతో కూడిన అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకుందని, ప్రతి మండపానికి ఒక క్యూఆర్ కోడ్‌ను జారీ చేయనున్నట్టు యలమంచిలి సీఐ ఎస్ ధనుంజయరావు తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో అనుమతి కోసం నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిష్ఠించే విగ్రహం ఎత్తు, మండప ప్రదేశం, నిమజ్జనం చేసే తేదీ తదితర వివరాలతో సింగిల్ విండో విధానంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అన్నీ సక్రమంగా ఉంటే అనుమతితో పాటు క్యూఆర్ కోడ్‌ను జారీ చేస్తామన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌లను ఉపయోగించకూడదన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరుపుకోవాల్సిందిగా సీఐ ప్రజలను కోరారు. ఈ సమావేశంలో యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, ఆచారి పాల్గొన్నారు.

సంతబయిల వినాయక ఆలయం ముస్తాబు


మునగపాకలోని సంతబయిల వినాయక ఆలయం

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల యువకులు పందిళ్లను ఏర్పాటు చేశారు. మునగపాకలోని సంతబయిల వినాయక ఆలయంలో నెల రోజుల పాటు వినాయక చవితి వేడుకలు జరగనున్నాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలు వినాయక మండపాల ఏర్పాటుకు అంతరాయం కలిగించినా మంగళవారం సాయంత్రానికి కొంతమేర తెరిపివ్వడంతో యువకులు ఉత్సాహంగా వేడుకలను నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం తగదు


మాట్లాడుతున్న సాయిబాబా

పాయకరావుపేట: రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్లను రీవెరిఫికేషన్ సాకుతో తొలగించడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అర్హత ఉన్న దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల ఏరివేత పేరుతోను, వికలాంగ శాతం పేరుతోను అర్హులకు కూడా నిలుపుదల చేసినట్లు నోటీసులు అందించడం దారుణమన్నారు. దివ్యాంగుల బాధను అర్థం చేసుకుని అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి


కోటవురట్ల సీహెచ్‌సీలో మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల: స్థానిక సీహెచ్‌సీలో మదర్ థెరిసా జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జల్లూరుకు చెందిన మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు పి.గోపినాథ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సర్పంచ్ బొడ్డపాటి అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు చేతుల మీదుగా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైద్యులు రోసీ, కనకలక్ష్మి, అనీషా, సంఘ సభ్యులు అచ్చిరాజు, బూకా ఏసు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలి


మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. గొడౌన్‌లో ఉన్న యూరియాను తక్షణమే సరఫరా చేయాలని కోరారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం స్లిప్పులతో వేచి ఉన్న రైతుల వద్దకు వెళ్లి సమస్య అడిగి తెలుసుకున్నారు. ముందురోజు స్లిప్పులు ఇచ్చారని, ప్రస్తుతం యూరియా కోసం అడిగితే సమాధానం చెప్పడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నేరుగా వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారితో ఫోన్‌లో మాట్లాడారు. అందుబాటులో ఉన్న యూరియాను సరఫరా చేస్తామని ఆమె బదులిచ్చారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ సీజన్‌కు ముందుగానే రైతుల అవసరార్థం యూరియాను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. వరిసాగుకు సంబంధించి పనులు ముమ్మరం అవుతున్న నేపథ్యంలో యూరియా లేకపోవడం విచారకరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతుల అవసరం మేరకు యూరియాను సరఫరా చేసేలా చూడాలన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు మద్దాల వీరునాయుడు, రాపేటి పరమేష్, తదితరులున్నారు.

జీవన ఎరువులతో సత్ఫలితాలు

కోటవురట్ల: జీవన ఎరువుల వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.ఉమాప్రసాద్ తెలిపారు. మండలంలోని సుంకపూరు, తంగేడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పొటాష్ రిలీజింగ్ బాక్టీరియా వాడే విధానం ప్రతీ రైతు తెలుసుకోవాలన్నారు. వరి మడిలో కాలిబాటలు తీయడం వల్ల దిగుబడి బాగుంటుందని తెలిపారు. తెగుళ్ల నివారణకు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, సేంద్రియ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సరోజిని, ఏఈవో మధు, వీఏఏలు సౌజన్య, గంగబాబు, రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలోని గోపాలపట్నం, మంగవరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగమణి, వీహెచ్ఏ రమ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎస్.రాయవరం: కొరుప్రోలు శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్టు స్థానికుల సమాచారం మేరకు దాడి చేసి నిందితులను పట్టుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సచివాలయ సిబ్బంది ఎందుకు రారు?

- ఎన్నిసార్లు చెప్పినా అధికారులకు పట్టడం లేదు
- కొక్కిరాపల్లిని పంచాయతీగా నోటిఫై చేయాలని 23వ వార్డు సభ్యుడు డిమాండ్
- తిరస్కరించిన ఛైర్‌పర్సన్.. కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష


సచివాలయ సిబ్బంది హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్‌ఛైర్మన్ అర్రెపు గుప్తా


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి రూరల్: 'ఇప్పటికి 44 సమావేశాలు జరిగాయి.. ఎన్నిసార్లు గొంతు చించుకుంటున్నా సచివాలయ సిబ్బంది కౌన్సిల్ సమావేశాలకు రావడంలేదు.. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలపై వాళ్లకే స్పష్టమైన అవగాహన ఉంటుంది.. వివిధ శాఖల అధికారులంతా హాజరవుతున్నా కీలకమైన సచివాలయ అడ్మిన్లు మాత్రం రారు.. ఇదేనా కౌన్సిల్ సమావేశాలపై శ్రద్ధ'అంటూ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అర్రెపు గుప్తా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎన్నోసార్లు గత సమావేశాల్లో ప్రశ్నించినా వాళ్లను ఎందుకు సమావేశాలకు పిలవడం లేదో అర్థం కావడం లేదంటూ ఆయన కమిషనర్‌ను నిలదీశారు. ఇక సమావేశాల్లో రాస్తున్న మినిట్స్, లేవనెత్తుతున్న సమస్యలు, ఇతర అంశాల గురించి పుస్తకాల్లో ఏం రాస్తున్నారో కౌన్సిలర్లకు తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 10 అంశాలతో కూడిన అజెండాకు సభ్యులు ఆమోదం తెలిపారు. 23వ వార్డు సభ్యుడు మజ్జి రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామం కొక్కిరాపల్లి పంచాయతీగా ఉన్నప్పుడే బాగా అభివృద్ధి చెందిందని, మున్సిపాలిటీలో విలీనం చేసి 13 ఏళ్లు పూర్తయినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, పైగా ఉపాధి హామీ పథకం అమలు నిలిచిపోయి పేద కుటుంబాలు ఉపాధి లేక రెండు పూటలా తిండికి సైతం ఇబ్బంది పడుతున్నాయన్నారు. అంతే కాకుండా ఇంటి పన్నులు భారీగా పెరిగిపోయాయన్నారు కొక్కిరాపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీ నుంచి డీనోటిఫై చేయడానికి కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి అంగీకరించకపోవడంతో నిరసనగా ఆయన సమావేశాన్ని బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలన్నింటిలో ఒకేసారి అభివృద్ధి సాధ్యం కాదని, క్రమంగా అభివృద్ధి జరుగుతోందని ఛైర్‌పర్సన్ తెలిపారు. మున్సిపాలిటీలో ఉన్న అన్ని వార్డుల్లో రామారాయుడుపాలెం వార్డు బాగా వెనుకబడిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, వార్డు కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, షేక్ బీబీ, ఈరిగిల గణేష్, సుంకర మరిణేశ్వర్రావు, పండూరి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మునగపాకలో మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


అచ్యుతాపురంలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మానవహారం నిర్వహిస్తున్న కైట్స్ విద్యార్థులు


పాయకరావుపేటలో మట్టి ప్రతిమలను అందిస్తున్న కాపునాడు నాయకులు

మునగపాక: ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బీసీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం ఆవరణలో ఆయన మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నాయకులు కోనసల్లి రామ్మోహనరావు,ఆడారి కాశీబాబు,కాండ్రేగుల జగన్,రాజాన బుజ్జి,బొడ్డేడ రామారావు పాల్గొన్నారు. మునగపాకకు చెందిన డేంజర్ గాయ్స్ యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వినాయక ఉత్సవాల పోస్టర్‌ను ప్రసాద్ ఆవిష్కరించారు.

అచ్యుతాపురం రూరల్ : స్థానిక మండల ప్రభుత్వ కార్యాలయాల వరకూ కైట్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి మట్టి వినాయకున్ని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. 500 మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు.

పాయకరావుపేట: కాపునాడు నాయకులు జగతా శ్రీను, కట్టా వీరబాబు, వికాస తరంగిణి ప్రతినిధి చిక్కాల శ్రీను పాయకరావుపేటలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. హైమా నేత్రాలయ వైద్యుడు ప్రసాద్ ఆధ్వర్యంలో కూడా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.

ఎరువుల గోదాముల తనిఖీ


గొడిచర్లలో ఎరువుల గోదాము తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి, సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు, గొడిచర్ల తదితర గ్రామాల్లో ఉన్న ఎరువుల గోదాములను మంగళవారం తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తనిఖీ చేశారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. స్టాకు వివరాలు పరిశీలించారు. ఎరువులను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచామని, కొరత లేకుండా రైతులకు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. అనంతరం వారు రాజయ్యపేట పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే భోజనం మెనూ ప్రకారం తయారు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఏఈవో సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

అచ్యుతాపురం: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్‌రావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన జిల్లా ముఠా కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముఠా కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక పరిశ్రమల్లో ముఠా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. లాలం నర్సింగరావు, ఆర్.రాము, గనిశెట్టి సత్యనారాయణ, సోమునాయుడు, కర్రి అప్పారావు, నానాజీ, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రశ్నలే గానీ సమాధానాల్లేవ్!

- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు
- మొక్కుబడి సమావేశాలెందుకని ప్రశ్న
- వాడీవేడిగా యలమంచిలి మండల సమావేశం


అధికారుల తీరును నిలదీస్తున్న కోఆప్షన్ సభ్యుడు సిద్దా నూకేశ్వర్రావు

యలమంచిలి రూరల్: ఒకప్పుడు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల ప్రణాళికల రూపకల్పనకు వేదికగా ఉండే మండల సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా మారాయి. సమావేశాల్లో అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఉండడంలేదు. పులపర్తిలో ప్రభుత్వ భూమిలో ఒక వ్యక్తి బోరు తవ్వించి, కొబ్బరి మొక్కలు వేసుకున్నాడని గత సమావేశాల్లో లేవనెత్తినా అధికారుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాకపోవడం దారుణమని, మొక్కుబడి సమావేశాలెందుకని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సిద్దా నూకేశ్వర్రావు మండిపడ్డారు. మంగళవారం యలమంచిలి మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలు అంశాలపై వాడీవేడి చర్చ జరిగింది. ముఖ్యంగా పులపర్తి గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై అధికారుల తీరును సభ్యుడు సిద్దా నూకేశ్వర్రావు తీవ్రంగా ఆక్షేపించారు. దీనిపై ఎంపీడీవో కొండలరావు మాట్లాడుతూ ఆ భూమిపై విచారణ జరిపామని, త్వరలో హెచ్చరిక బోర్డు పెడతామని చెప్పి సమావేశానికి వచ్చిన పులపర్తి కార్యదర్శిని అక్కడ బోర్డు పెట్టాల్సిందిగా ఆదేశించారు. పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో రహదారి వేయడానికి ఏమైనా అనుమతి ఉందో? లేదో చెప్పాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అటవీశాఖ అధికారులను నిలదీశారు. తమకు తెలిసినంత వరకు అనుమతి లేదని చెప్పగా అక్కడ యంత్రాలతో తవ్వకం పనులు చేస్తున్నారు కదా మీకు వీడియోలు పంపమంటారా? అని అడిగారు. దీనికి అటవీ సిబ్బంది నుంచి సరైన సమాధానం రాలేదు. అంతకుముందు శాఖల వారీగా అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు,సంక్షేమ పథకాల గురించి వివరించారు. దివ్యాంగుల పింఛన్లు తొలగింపుపై స్పష్టత ఇవ్వాలని వైస్ ఎంపీపీ రాజాన శేషు ఈవోపీఆర్డీ దీపికను కోరారు. 16 మంది అనర్హులుగా తేలడంతో పింఛన్లను పూర్తిగా తొలగించామన్నారు. యలమంచిలి పట్టణంలో పాత ప్రభుత్వాస్పత్రి నుంచి సైతారుపేట రహదారి 800 మీటర్ల పొడవున పునర్నిర్మించడానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని రోడ్లు భవనాల శాఖ ఏఈఈ సత్యవాణి తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదని వ్యవసాయాధికారి పి మోహన్‌రావు తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాలు త్వరలో వస్తాయని డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు చౌక దుకాణాలు తెరిచి ఉంచేలా చర్యలు తీసుకుంటామని డీటీ చెప్పారు. మండల ఉద్యానశాఖాధికారి సాయిప్రియ, బయ్యవరం సర్పంచ్ పండు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.